నేడు రాజన్న తలనీలాలకు వేలం

వేములవాడ, ఏప్రిల్ 1: వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాల హక్కులకు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు రాజన్న ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే మూడుసార్లు టెండర్, బహిరంగ వేలం నిర్వహించినా, మూడు రాష్ట్రాల్లో ప్రకటనలు ఇచ్చినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కాగా, ఇప్పటివరకు బహిరంగ వేలానికి ఒకరు మాత్రమే ముందుకు వచ్చారని చెబుతున్నారు. కాగా, నేటి టెండర్ ద్వారా తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

కలెక్టరేట్, ఏప్రిల్ 1: ప్రజాపాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నదని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ మండిపడ్డారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసనలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తే ముందస్తుగా విద్యార్థులను అరెస్ట్ చేయడం దారుణమని, నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. మంగళవారం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కమిటీ సభ్యులు శివ, సాయి భరత్, రాహుల్, మహేశ్ పాల్గొన్నారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

గంభీరావుపేట, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సంఘ జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కల్యాణ్‌కుమార్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసనలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తే ముందస్తుగా అరెస్ట్ చేయించడం ప్రభుత్వానికి తగదన్నారు. వణ్య ప్రాణులను చంపి అట్టి భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. విద్యార్థి సంఘ నేతలను అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాన్ని ఎవరు ఆపలేరని స్పష్టం చేశారు.

ఆరె క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 1: ఆరెపల్లిలో ఆరె క్షత్రియ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిలువేణి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా ఇటిక్యాల లింగయ్య, కార్యవర్గ సభ్యులుగా సిలువేని రఘుపతి, సిలువేని లింగన్న, మంజెడి శ్రీనివాస్, హింగే ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆరె క్షత్రియ సంఘం నాయకులు మల్లేశం, రాజు, ప్రసాద్, లింగయ్య, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం

రుద్రంగి, ఏప్రిల్ 1: ముదిరాజ్ సంఘం రుద్రంగి మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బోండ్ల సత్యం, ఉపాధ్యక్షులుగా పాల నర్సయ్య, నేవూరి చిన్న నర్సయ్య, కార్యదర్శిగా దాసరి అశోక్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు సత్యం మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ సంఘ సభ్యులు గండి నారాయణ, బోయిని చంద్రయ్య, బోయిని రాజు, పండుగు గంగాధర్ ఉన్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

బోయినపల్లి రూరల్, ఏప్రిల్ 1: కొదురుపాక గ్రామంలోని ఓ ఇంట్లో దొంగతనంలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. బాధితురాలు జలజ ఇచ్చిన ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు రెండు బృందాలుగా గాలించి సాంకేతిక సాయంతో నిందితులను పట్టుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఇద్దరు మైనర్లతోపాటు ఇద్దరు భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. వీరి వద్ద కరీంనగర్, వేములవాడ పట్టణాల్లో చోరీ చేసిన రెండు బైకులు, నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు జతల పట్ట గొలుసులు, వెంకట్రావుపల్లి గ్రామంలో వెల్డింగ్ షాప్‌లో చోరీ చేసిన ఒక మిషన్‌ను రికవరీ చేశామని తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్, కానిస్టేబుల్ తిరుపతి, కోటేశ్వరరావును ఏఎస్పీ అభినందించారు.

అటు మరమ్మతులు.. ఇటు లీకేజీలు

- పోచమ్మ తండాలో తీరని మంచినీటి బాధ
- మళ్లీ మొదటికి వచ్చిన సమస్య

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 1: గుండారం గ్రామంలోని పోచ మ్మ తండా వాసుల మంచినీటి బాధ తీరలేదు. మిషన్ భగీరథ జలాల అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురితం కాగా, అధికారులు సోమవారం తండాకు వచ్చి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీరందించారు. అయితే బాగు చేసి 24 గంటలు కూడా గడువకముందే మరోచోట పైప్‌లైన్ లీకైంది. నీటి సరఫరాకు బ్రేక్ పడింది. వెంటనే పంచాయతీ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసి నీరందించే ప్రయత్నాలు చేస్తున్నారు. పైప్‌లైన్ వేసి చాలా రోజులైనందున బ్లాక్ అయి లీకేజీ సమస్యలు ఏర్పడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా లీకేజీ సమస్యలను పరిష్కరిస్తామని అంటున్నారు. ఇదే టైంలో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పల్లె ప్రకృతి వనంలో మంగళవారం మరో బోరును వేయించారు.

నిరుపేద రైతుకు కోడె అందజేత

ఇల్లంతకుంట, ఏప్రిల్ 1: గాలిపెల్లి గ్రామానికి చెందిన కేశవేని ఎల్లయ్యకు చెందిన కాడెద్దు ఎర్ర దొమ్ము వచ్చి మంగళవారం మృతి చెందింది. రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న ఇల్లంతకుంటలోని శ్రీకృష్ణ గోశాల ట్రస్టు చైర్మన్ అయ్యన్న గారి హరికృష్ణా రెడ్డి, ట్రస్టు సభ్యులు స్పందించి నిరుపేద రైతుకు గోశాల నుంచి కోడెను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కూనబోయిన బాలరాజు, బొనగిరి రాము, నారెడ్డి కిశోర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కీసరి కనకయ్య, బండారి నర్సయ్య ఉన్నారు.

కారు డోర్స్ ఆటోమెటిక్ లాక్

- అరగంటపాటు లోపలే ఉండిపోయిన బాలుడు
- స్థానికుల సాయంతో తప్పిన ప్రమాదం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 1: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కారు ఆటోమేటిక్ లాక్ అవ్వడంతో అరగంట పాటు ఓ బాలుడు కారులోనే బందీ అయ్యాడు. తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన విష్ణు తన కొడుకుతో కలిసి కారులో సిరిసిల్లలోని గాంధీ చౌక్‌కు వచ్చాడు. రోడ్డు పక్కన కారు నిలిపి పాల ప్యాకెట్లు కొనుగోలు చేసేందుకు అవతలి వైపు ఉన్న దుకాణానికి వెళ్లాడు. విష్ణు వచ్చే సరికి కారు డోర్స్ ఆటోమేటిక్ లాక్ అవ్వడంతో చిన్నారి అరగంటకు పైగా కారులోనే ఉండిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు కారు అద్దాలను కిందికి దించి లాక్ ఓపెన్ చేయగా, చిన్నారి తండ్రి విష్ణు ఊపిరి పీల్చుకున్నాడు

పాలన అస్తవ్యస్తం.. పర్యవేక్షణకు మంగళం

- గాడి తప్పుతున రాజన్న ఆలయం నిర్వహణ
- ఎనిమిది నెలలుగా కన్నెత్తి చూడని ఇద్దరు ఉద్యోగులు
- సెలవుల్లో మరో తొమ్మిది మంది
- భక్తులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

వేములవాడ, ఏప్రిల్ 1: రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రంగా విలసిల్లుతున్న రాజన్న ఆలయంలో పరిపాలన గాడి తప్పుతున్నది. ఉన్నతాధికారుల పట్టింపు, పర్యవేక్షణ లోపంతో అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడికి బదిలీపై వచ్చిన ఉద్యోగులు ఎనిమిది నెలలుగా కన్నెత్తి చూడకపోవడం, మరో తొమ్మిది మంది సెలవుల్లో ఉండడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఫలితంగా కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతుండగా, ఉన్నతాధికారుల చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది.

బదిలీపై వచ్చి.. ఎనిమిది నెలలుగా కానరాని ఉద్యోగులు

వేములవాడ రాజన్న ఆలయంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. రీజినల్ జాయింట్ కమిషనర్ హోదా కలిగిన టెంపుల్‌లో ప్రస్తుతం పరిపాలన, భక్తుల కనీస సౌకర్యా కల్పన, ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిన ఉద్యోగులు విధుల్లో లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నది. రాష్ట్రంలోని ఆలయాల్లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులను ప్రధాన ఆరు దేవాలయాలను యూనిట్‌గా చేసి గతేడాది ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాసర ఆలయం నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంట్ విలాస్ రావు, భద్రాచలం నుంచి వచ్చిన జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ ఇక్కడ రిపోర్ట్ చేసి, ఎనిమిది నెలలుగా ఆలయానికి రాకుండానే అనారోగ్య సెలవుల్లో ఉన్నారు. అయితే వీరు ఎనిమిది నెలలుగా విధుల్లో చేరకుండా ఎందుకు ఉన్నారు..? అనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తున్నది. వేములవాడ నుంచి బాసరకు బదిలీ అయిన పర్యవేక్షకుడు లక్ష్మణరావు, యాదగిరిగుట్టకు బదిలీ అయిన శివరాం, యాదగిరిగుట్ట నుంచి భద్రాచలం బదిలీ అయిన అఘారెడ్డి విధులకు హాజరు కాకపోవడానికి తీవ్రంగా పరిగణిస్తూ అక్కడి ఆలయ అధికారులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు సరెండర్ చేసినట్టు తెలిసింది. రాజన్న ఆలయానికి వచ్చిన వీరి పట్ల మాత్రం ఎందుకు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారో..? రాజన్నకే తెలియాలి.

సెలవుల్లో రాజన్న ఉద్యోగులు

రాజన్న ఆలయంలో ఇతర ఆలయాల నుంచి వచ్చిన ఉద్యోగులు ఒకరిద్దరు మినహా మిగతా వారందరూ వచ్చామా వెళ్లామా..? అన్నట్టు పనిచేస్తున్నారని బాహటంగానే పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రెండ్రోజుల కింద సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. కనీస వసతి సౌకర్యాలు, ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిన ఉద్యోగులు సెలవులో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక పీఆర్‌వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఈవో అశోక్, పర్యవేక్షకుడు శ్రీకాంత్ సైతం సెలవులోనే ఉన్నారు. మరో జూనియర్ అసిస్టెంట్ సింహాచారి కూడా మంగళవారం మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించి సెలవుపై వెళ్లినట్లు సమాచారం. లడ్డూ ప్రసాదంలో పర్యవేక్షకుడు సంజీవరావు సైతం 10 రోజులుగా సెలవులో ఉన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శివ సైతం ఇటీవల అనారోగ్యంతో సెలవు పెట్టారు. ఇక పరిపాలన కార్యాలయంలో విధులు నిర్వహించే సీనియర్ అసిస్టెంట్ మందస్వామి, రికార్డ్ అసిస్టెంట్ భాను కూడా అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నారు. ఇదిలా ఉండగా కార్యనిర్వహణ అధికారి సైతం సెలవుపై వెళ్లినట్టు తెలిసింది. బుధవారం తలనీలాల వేలం పాట నిర్వహించనుండగా, వీరు హాజరవుతారా..? లేదా అనేది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా మారింది.

అయిష్టంగా.. ఆపై కష్టంగా..!

రాష్ట్రంలో వివిధ ఆలయానికి బదిలీపై వెళ్లిన ఉద్యోగులు తమ విధులను అయిష్టంగా, ఆపై కష్టంగా నిర్వహిస్తున్నట్లుగా తెలుస్తోంది. వేములవాడలోనూ పలువురు ఒకటి రెండ్రోజుల పేరుతో సెలవు పై వెళ్లి వారం పది రోజుల వరకు కన్నెత్తి చూడడం లేదని తెలుస్తున్నది. లీవ్‌లో ఉన్న ఉద్యోగులు తమ సెలవు గడిచిపోయినప్పటికీ రిపోర్ట్ చేయకపోగా, తాత్కాలికంగా ఉన్న అధికారులను మచ్చిక చేసుకొని కాలం వెల్లదీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా బదిలీ అయిన దేవాదాయ శాఖ ఉద్యోగులు తమ మాతృ సంస్థలకు వెళ్లేందుకు సంబంధిత ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. పరిస్థితి ఇలా ఉంటే భక్తులకు ఇబ్బందులు తప్పవని, పరిపాలనను ప్రభుత్వం గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- సంక్షేమమే లక్ష్యంగా పథకాల అమలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తున్నదని, దేశంలోనే ప్రప్రథమంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నదని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద రేషన్ దుకాణంలో సన్నబియ్యం పథకాన్ని విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 17,263 రేషన్ దుకాణాల ద్వారా 2.91లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు కోటీశ్వరులుగా చేయాలన్న ఉద్దేశంతో ఇప్పటికే ఇందిరా మహిళా శక్తి కింద వివిధ యూనిట్లు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఎస్పీ మహేశ్ గితే, ఆర్డీవో రాధాబాయి, పౌరసరఫరాల శాఖ అధికారి వసంత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, ఏప్రిల్ 1: పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో ఉచితంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. పేదలందరూ దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం తినాలనే ఒక దృఢసంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆదాయాన్ని పెంచడం పేదలకు పంచడం అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని చెప్పారు. ఇక్కడ డీసీఎస్‌వో వసంత, డీఎం రజిత, తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస్, ఆర్ఐ మహేందర్, ఏపీఎం రజిత, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఎస్సారార్‌లో తొమ్మిది టీఎంసీలు

బోయినపల్లి, ఏప్రిల్1: బోయినపల్లి మండలంలోని ఎస్సారార్ రిజర్వాయర్‌లో 9.267 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 27.55 టీఎంసీలు కాగా, ప్రస్తుతం రిజర్వాయర్ నుంచి ఎల్‌ఎండీకి 2900 క్యూసెక్కులు, కుడి కాలువకు 400 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 5 క్యూసెక్కుల విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

'రాజీవ్ యువ వికాసం'తో ఉపాధి

- అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులకు శిక్షణ

మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, ఏప్రిల్ 1: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా తీసుకొచ్చిన 'రాజీవ్ యువ వికాసం'తో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందుతాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. నిరుద్యోగ యువత, ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, బ్యాంకర్లకు పథకంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. అంతకుముందు స్కీంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అర్హులైన వారు తమ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. తహసీల్దార్లు కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీపై ప్రత్యేక దృష్టి సారించి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయాలు మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలని తెలిపారు. గడువులోగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి మండల్ లెవల్ కమిటీకి, అక్కడి నుంచి జిల్లా కమిటీకి పంపిస్తారని వెల్లడించారు. అనంతరం అర్హులు ఎంపిక చేసుకున్న రుణాలకు సంబంధించిన శిక్షణను అందజేస్తారని తెలిపారు. అభ్యర్థులు, పూరించిన దరఖాస్తు ఫారం హార్డ్ కాపీ, అవసరమైన పత్రాలను జత పరిచి మండల ప్రజాపాలన సేవా కేంద్రం ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో సమర్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయ్, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో ఈ నెల 3న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి యాదవ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని మండల యాదవ సంఘం అధ్యక్షుడు రాగం నాగరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ పట్టణ అధ్యక్షుడు ఎలుసాని దేవయ్య, ప్రధాన కార్యదర్శి తాడేపు రవి, నాయకులు అనిల్, కోడె శ్రీనివాస్, బైతి నవీన్,తాడేపు ఎల్లం, బొమ్మెన ఆంజనేయులు, శీలం ప్రశాంత్ పాల్గొన్నారు.

పద్మశాలీ సేవా సంఘం ఎన్నిక

ముస్తాబాద్, ఏప్రిల్ 1: ముస్తాబాద్ పట్టణ పద్మశాలి సేవా సంఘం కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా తడక బాలకిషన్‌ను ఎనిమిదోసారి ఏకగ్రీవంగా సంఘ సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దొంత బాలరాజు, ఉపాధ్యక్షుడిగా గౌడ మల్లేశం, కార్యవర్గ సభ్యులు బిట్ల దేవానందం, బండారి శ్రీకాంత్, కృష్ణ, శ్రీరామ్ మనోహర్, గౌడ దేవనందం, మెరుగు భూమేష్, గౌడ మల్లేశం, మారెల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకువస్తానని చెప్పారు.

పథకాలపై కళా ప్రదర్శన

కళా ప్రదర్శన ఇస్తున్న సాంస్కృతిక సారథి కళా బృందం

చందుర్తి, ఏప్రిల్ 1: ప్రభుత్వ పథకాలు, ఎండల తీవ్రతపై మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు ఆధ్వర్యంలో మంగళవారం కళా ప్రదర్శన నిర్వహించారు. వేసవి దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని పాట,మాట రూపంలో ప్రదర్శన ఇచ్చారు. స్వచ్ఛత, పచ్చదనం, తడి పొడి చెత్తను వేరుచేయడం, సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఇక్కడ సాంస్కృతిక సారథి వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు. కళాకారులు గడ్డం దేవయ్య పూడూరు సంజీవ్ అంతర్పుల ఝాన్సీ, లావణ్య, శ్రీలత, శిరీష ఉన్నారు.

బాకీ డబ్బుల కోసం భార్య చేయి పట్టుకున్నాడని..

- భర్త ఆత్మహత్యాయత్నం

చందుర్తి: బాకీ డబ్బులు చెల్లించడం లేదని ఓ వ్యక్తి తన భార్య చేయి పట్టుకున్నాడని మనస్తాపం చెందిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన చందుర్తి మండలంలో జరిగింది. ఎస్ఐ అంజయ్య, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి ఎల్లారెడ్డిపేటకు చెందిన శివరాత్రి దేవయ్య దండుగుల నరేశ్ వద్ద రెండు తులాల బంగారాన్ని అప్పుగా తెచ్చుకున్నాడు. ఏడేళ్ల క్రితం జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లి వచ్చిన ఆ వ్యక్తి వారికి రెండు తులాల బంగారం ఇచ్చాడు. ఒప్పంద పత్రం ప్రకారం సదరు వ్యక్తి వారికి మరో తులం బాకీ ఉన్నాడు. అయితే, ఆ వ్యక్తి జీవనోపాధి కోసం చందుర్తి మండలంలో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాడు. అయితే అతని వద్దకు మంగళవారం సదరు వ్యక్తులు వచ్చి మిగిలిన తులం బంగారం డబ్బులు అడిగారు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. వచ్చిన వ్యక్తులు ''నీ భార్యను తీసుకుపోతే డబ్బులు వస్తాయి' అంటూ అతని భార్య చేయి పట్టుకోవడంతో మనస్తాపం చెందిన భర్త, అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. కాగా, ఆ వ్యక్తి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివరాత్రి దేవయ్య, దండుగుల నరేశ్, దండుగుల రాజవ్వపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్ఐ పేర్కొన్నారు.

కాంగ్రెస్ అంటేనే మోసం

- అధికారం కోసం 420 హామీలిచ్చి ముంచింది
- బీఆర్ఎస్‌వై నేత నవీన్ రెడ్డి

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వై నేత నవీన్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 1: కాంగ్రెస్ అంటేనే మోసమని, అధికారంలోకి వచ్చేందుకు ప్రజలు అనేక మాయమాటలు చెప్పి, 420 హామీలిచ్చి నిండా ముంచిందని తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్‌వై నేత నవీన్ రెడ్డి ధ్వజమెత్తారు. రైతు భరోసా ఇస్తామని, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని మభ్యపెట్టి ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో చేయలేక చేతులెత్తేసిందని మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా రూ.6 వేలు ఇస్తామని చెప్పి అందరికీ ఇవ్వలేదని, చాలా మందికి పెండింగ్‌లో పెట్టారన్నారు. రాబోయే వానకాలం పంటతో కలిపి రైతు భరోసా కింద రైతులకు బాకీ పడ్డ రూ.21వేల కోట్లు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఓ వెలుగు వెలిగిన సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమను పట్టించుకోక సంక్షోభంలో నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీరల ఆర్డర్లు, ప్రోత్సాహం లేక అనేక కార్మిక కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని, ఉపాధి లేక వలస పోతున్నాయన్నారు. పలువురు కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం బాధాకరమన్నారు. కాళేశ్వరంపై కావాలనే దుష్ప్రచారం చేసి, కేవలం రాజకీయ కక్షతో, కేసీఆర్‌పై అక్కసుతో ప్రాజెక్టును ఎండబెట్టి రైతుల పొట్టకొట్టారని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధిని మరిచిపోయారని, ఏడాదిన్నర పాలనలో చేసింది శూన్యమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కేసీఆర్ హయాంలో చేపట్టిన పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు పరకపల్లి తిరుపతి, పవన్ రెడ్డి, ఖౌటిశివా, ఉమాశంకర్, ఢెంబరవేణి శివా, బూర సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి సరికాదు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు

వేములవాడ, ఏప్రిల్ 1: సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిరసన చేపడుతున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం సరికాదని వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్వీ నాయకులు పోతు అనిల్ కుమార్ మండిపడ్డారు. మంగళవారం వేములవాడలోని చల్మెడ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేలం వద్దని నిరసన చేస్తున్న విద్యార్థులను దేశ ద్రోహుల్లా దాడి చేశారని, ఇదేనా ప్రజాపాలన అని దుయ్యబట్టారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భూముల వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తుమ్మల దిలీప్, పర్వేజ్, శివ, రాకేశ్, సందీప్, రఫీలు ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 1: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బండపల్లి శివారులో ఆటోను ద్విచక్రవాహనం మంగళవారం ఢీకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బండపలికి చెందిన ఇద్దరు మైనర్లు ద్విచక్ర వాహనంపై బండపల్లి నుంచి వేములవాడ వైపు వెళ్తుతుండగా, వేములవాడ నుంచి బావుసాయిపేట వైపు వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కోనరావుపేట మండలం బావుసాయిపేటకు గెంటె ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు బాధితులను చికిత్స కోసం వేములవాడలోని దవాఖానకు తరలించారు. అలాగే చందుర్తి మండలం సనుగులలో దేవునితండాకు వెళ్లే రహదారిలో మంగళవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో చందుర్తికి చెందిన కోన నరేశ్, మల్యాలకి చెందిన కాదాసు నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

నేను కొల్లూరి వసంత, పాస్‌పోర్ట్ నెం: V5844545 కలిగి ఉన్నాను, తెలంగాణలోని చెల్గల్, జగిత్యాల, H.No. 5-11/1లో నివసిస్తున్న తరాల గణేష్ భార్యని, వివాహం తర్వాత నా ఇంటి పేరును మార్చుకున్నానని మరియు ఇకపై అన్ని అధికారిక మరియు చట్టపరమైన ప్రయోజనాల కోసం తరాల వసంత అని పిలువబడతానని ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను. సంబంధిత పత్రాలన్ని ఈ మార్పును తదనుగుణంగా ప్రతిబింబిస్తాయి.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189